ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 189 | గురువారం 9 ఏప్రిల్ 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## 15రోజులు సీజ్ ఫైర్



- ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం ప్రకటించిన ట్రంప్..
- హార్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్..
- అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు...
- కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర ..
- ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు డొనాల్డ్ ట్రంప్...

**వాషింగ్టన్ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**

గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు.
ఇరాన్ -అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు 2లో

## కాల్పుల విరమణతో ప్రపంచ శాంతి

**ఇదో గొప్ప సుదినమంటూ ట్రంప్ పోస్ట్**



**వాషింగ్టన్ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఇరాన్‌తో కాల్పుల విరమణపై అమెరికా డీల్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ప్రకటన చేశారు. ప్రపంచ శాంతికి ఇది గొప్ప దినం అన్నారు. ఇరాన్ ఇదే కోరుకుంటోంద న్నారు. తాజా వార్‌లో ఇరాన్ చాలా దెబ్బ తిన్నట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో 2లో

## భవానీపూర్ లో మమత నామినేషన్

**భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు..**

**నా జీవితం ఇక్కడే ప్రారంభం అయ్యిందని వెల్లడి..**




**కోల్‌కతా(తెలుగోడు), ఏప్రిల్ 8 :**
పశ్చిమబెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైం దని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానిం చారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్ లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే 2లో

## కోర్టు తీర్పు వచ్చే వరకు ఆగలేరా

**అప్పడే వెళ్లి రైతులను వేధించాలా**

**హైడ్రా తీరుపై మండిపడ్డ మందకృష్ణ మాదిగ**



**హైదరాబాద్ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఐలాపూర్‌లోని సర్వే నంబర్ -1 నుంచి 220 వరకు గల 1265 ఎకరాల భూమి భూ వివాదంలో పేద రైతులను హైడ్రా ఇబ్బంది పెట్టడం సరికాదని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివాదాస్పద 2లో

## బిజెపి చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం

**ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు**



**న్యూఢిల్లీ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం 2లో

## కట్టుదిట్టంగా రహదారుల నిర్మాణం



**రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సమీక్ష...**

**అధికారులకు చంద్రబాబు దిశా నిర్దేశం..**

**అమరావతి (తెలుగోడు),ఏప్రిల్ 8 :**
రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై 2లో

## క్రీడాభివృద్ధికి పెద్దపీట

**ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియం అభివృద్ధి చేస్తాం..**

**మూడు దశల్లో 160 కోట్లతో అభివృద్ధి పనులు..**

**క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి..**



**విజయవాడ(తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడల వికాసానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తో పాటు యువ నేత, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. లోకేశ్ నేతృత్వంలో ఆంధప్రదేశ్ క్రీడాంధ్ర ప్రదేశ్ కావడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా మరో రూ.20 కోట్లు.. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.160 2లో

## ఇరాన్‌ను సురక్షితంగా వీడండి

**భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ 2లో

## తీరు మార్చుకోకపోతే ఉపేక్షించం

- టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం..
- పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం..
- పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం..
- మంగళగిరి టిడిపి ఆఫీస్‌లో లోకేశ్..



**అమరావతి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ 2లో

## అమరావతికి కేంద్రం గుడ్ న్యూస్

**సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రూ.2,534 కోట్లు**

**న్యూఢిల్లీ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అమరావతిలో కేంద్ర నిర్మాణాల కోసం రూ.2,534 కోట్ల ప్రణాళిక సిద్ధమైంది. ఇందులో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రూ.1,299.08 కోట్లు, నివాస సముదాయాల ఏర్పాటు కోసం రూ.1,234.91 కోట్లు కేటాయించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధమై ముందడుగు పడ్డాయి. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను అధికారులు ఇప్పటికే సమర్పించారు. వచ్చే కేంద్ర కేబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశాలు ఉన్నాయి. సెక్రటేరియట్ నిర్మాణానికి 5.53 ఎకరాలు, నివాస సముదాయాల కోసం 17 ఎకరాలు నిర్మాణాలకు వినియోగించనున్నారు.

## హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

**తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి..**

**సిఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ..**



**అమరావతి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలం గాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితోపాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని సిఎంను కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని 2లో

## పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగిస్తాం

- చెత్త పన్ను వేసినా తొలగిన చెత్త..
- మరో 50 లక్షల మెట్రిక్ టన్నులు తొలగించాలి..
- మీడియాతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి...



**అమరావతి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
చెత్తపైనా పన్ను వేసిన గత వైసీపీ ప్రభుత్వం చెత్తను తొలగించకుండా భారీగా నిల్వలు పెట్టి వెళ్లిందని, మాజీ సీఎం జగన్, వైసీపీపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించకుండా పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికే 100 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని... ఇంకా 50 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించాల్సి ఉందని వివరించారు. ఇకపై ఏ రోజు చెత్తను ఆ రోజు ప్రాసెసింగ్ చేసేలా సరికొత్తగా ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పట్టాభి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 107 మున్సిపాలిటీల్లో రూ.528.65 కోట్ల వ్యయంతో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని పట్టాభి రాం వెల్లడించారు. 5300 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసేలా ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కేంద్రం రూ.213 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.141 కోట్లు నిధులు కేటాయించినట్లు 2లో

## రూ.41,533.81 కోట్లు కేటాయింపు

- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు..
- ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ..
- జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం..



**న్యూఢిల్లీ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయంతీసుకుంది.

## అమరావతి పేరుతో కూటమి మోసం

- తెరపైకి మూడు రాజధానుల ప్రస్తావన..
- విశాఖ కార్యనిర్వాహక రాజధానిగా సరైన ఎంపిక..
- కర్నూలు న్యాయ రాజధాని, అమరావతి శాసన రాజధాని... జగన్..



**తాడేపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
రాజధాని విషయంలో తాము ఆచరణాత్మక పరిష్కారం చూపామని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ కేడర్ భేటీలో ఆయన మాట్లాడుతూ, అమరావతి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మూడు రాజధానుల ప్రతి పాదనను మరోసారి ప్రస్తావించిన వైఎస్ జగన్, విశాఖపట్నంను కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా సూచించామని తెలిపారు. ఇదే కాకుండా ప్రత్యామ్నాయంగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలతో కూడిన మావిగన్ కారిడార్‌ను ప్రతిపాదించినట్లు చెప్పారు. అమరావతి నిర్మాణానికి భారీగా ఖర్చు పెట్టడం కంటే తక్కువ పెట్టుబడితో మావిగన్ ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించవచ్చని వైఎస్ జగన్ పేర్కొన్నారు. తమ పాలనలో చేసిన అప్పులను సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించామని, ప్రస్తుతం తీసుకుంటున్న అప్పులు ఎవరి ప్రయోజనాల కోసం అనేది ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.వచ్చే ఏడాది పాదయాత్ర చేపట్టి ప్రజల్లోకి వెళ్లనున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు.

## 15 రోజులు సీజ్ ఫైర్

(మొదటి పేజి (తరువాయి)

జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

## ఇరాన్‌ను సురక్షితంగా వీడండి

(మొదటి పేజి (తరువాయి)

నంబర్లను షేర్ చేసింది. ఇరాన్-అమెరికా (ఎసజీని-జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మీషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

## ప్రపంచ శాంతి

(మొదటి పేజి (తరువాయి)

మళ్లీ చమురు నౌకల సందడి పెరుగుతుందని, దీనికి అమెరికా సహకరిస్తుందన్నారు. చాలా పాజిటివ్ యాక్షన్ ఉండబోతుందన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదిస్తారని, ఇరాన్ మళ్లీ పునర్ నిర్మాణ పనులు మొదలుపెడుతుందన్నారు. ఇక రాబోయే రోజుల్లో పశ్చిమాసియాలో స్వర్ణ యుగం ఉండబోతుందన్నారు. తనకు నమ్మకం ఉందన్నారు. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని విక్టరీగా చెప్పుకున్నారు. ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇండోనేషియా స్వాగతించింది. ఇరు దేశాలు సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పేర్కొన్నది. దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు అని ఇండోనేషియా విదేశాంగ శాఖ ప్రతినిధి యెన్నె మివాంగ్‌కాంగ్ తెలిపారు.

## భవానీ పూర్‌లో మమత నామినేషన్

(మొదటి పేజి (తరువాయి)

భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

## బిజెపి చెప్పు చేతల్లో ఎన్నికల సంఘం

(మొదటి పేజి (తరువాయి)

జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజీవ్రాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజీవ్రాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

## హొంగార్డుల సమస్యలు పరిష్కరించండి

(మొదటి పేజి (తరువాయి)

ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అదే విధంగా పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాడుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

### లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ.. యువనేత పరిటాల శ్రీరామ్ ..

**బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వ సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని ధర్మవరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఈదుల ముష్టూరు లో జలధార -- నీటి భద్రత కార్యక్రమంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు శ్రీరామ్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామాపురం గ్రామానికి చెందిన రామలక్ష్మికి రూ.41.50 వేల చెక్కు, నెత్తివారంపల్లి గ్రామానికి చెందిన ఆనంద్‌కు రూ.37.34 వేల చెక్కును అందజేశారు. మొత్తం రూ.78.84 వేల ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందన్నారు. సరైన సమయంలో అందే ఈ సహాయం కుటుంబాలకు పెద్ద ఆదరణగా మారుతోందని పేర్కొన్నారు.అదేవిధంగా ఎన్టీఆర్ వైద్య సేవలు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉండటంతో ప్రజలు వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, రైతు సంఘం అధ్యక్షుడు చల్లా శీనా, యూనిట్ ఇంచార్జ్ బత్తల మనోజ్, బీజేపీ నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, శ్రీరాములు, బోయపాటి అప్పు, సాగునీతి సంఘం అధ్యక్షుడు నరేంద్ర, మరినేని కిరణ్, ఆదినారాయణ, వడ్డే రాజు, ముసలప్ప, కొండన్న, సాంబ, మారుతీ, రాజు, చల్లా నాయుడు, లోకనాథ్, చిట్రా నాగభూషణం, దురగమప్ప, కుంటాల రాము, రమణప్ప, తిరుపతీ నాయుడు, శీనా, శివయ్య, నాయుడు, శేఖర్ వెంకటరాముడు, సాయి, మూళ్ళగురు సూరి, సూరి, చౌదరి, బోయపాటి రాము, తరిగొపుల చౌదరి, దేరంగుల ప్రతాప్, వీరా, దేరంగుల హరి, జంపుల రవి, మౌలా, కృష్ణయ్య, యర్రప్ప, బాలకృష్ణ, అధికారులు, ఎంపీడీవో నరసింహనాయుడు, తహసిల్దార్ స్వర్ణ లత, తదితరులు పాల్గొన్నారు..



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న పరిటాల శ్రీరామ్

# వైద్య సేవలు అందించడంలో రాజీ పడొద్దు

### డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం..

**నల్లమాడ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందజేయడంలో ఎలాంటి రాజీ పడొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం స్పష్టం చేశారు. మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, వైద్య సేవలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది హాజరు నమోదు, వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. హెచ్‌పీవీ టీకా కార్యక్రమానికి సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు, పిహెచ్‌సీలో కొనసాగుతున్న వల్నరబుల్ జనాభా ఎక్స్‌రే స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సమీక్షించారు. తనిఖీ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని గదులను ఆమె పరిశీలించారు. వైద్య చికిత్సల కోసం వచ్చిన రోగులతో స్వయంగా మాట్లాడి, చికిత్సలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయంపై ఆరా తీశారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఆమె సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ అన్ని ఆరోగ్య కార్యక్రమాలను 100% పూర్తి చేయాలని డాక్టర్ ఫైరోజా బేగం ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మమణి, సీహెచ్ఓ రామాంజులు, సూపర్వైజర్ ఎస్.ఎం. బాషా, డీటీసీ సూపర్వైజర్ అబీద్ బాషా, ఎరికాలప్ప, అంజి, సీహెచ్ఓలు గౌతమి, నజీబ్, కిరణ్, విద్య, ఆశా కార్యకర్తలు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న
జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం

## మాజీ సీఎం జగన్‌ను కలిసిన రోళ్ల జడ్పిటిసి అనంతరాజు

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
విజయవాడలోని తాడేపల్లి గూడం వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని జడ్పిటిసి అనంతరాజు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అనంతరాజు తోపాటు న్యాయవాది మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వత్ నారాయణ పూలమాలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఇరువురిని జగన్మోహన్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.అనంతరం మడకశిర నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని జగన్మోహన్ రెడ్డి ఆదేశించినట్లు వారు తెలిపారు.పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. మడకశిర నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యుల అందరిని కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు.



జగన్మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న జెడ్పిటిసి అనంతరాజు



జడ్పిటిసి అనంతరాజుని ఆప్యాయంగా పలకరిస్తున్న
మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

# ఘనంగా కొల్లాపూరి మహాలక్ష్మికి జ్యోతుల ఉత్సవాలు

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
మండల పరిధిలోని రత్నగిరి, గుడ్డగురికి గ్రామాల్లో వెలిసిన శ్రీ కొల్లాపూరి మహాలక్ష్మి అమ్మవారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా జ్యోతుల ఉత్సవాలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో అమ్మవారికి ఉదయం నుంచి సుప్రభాత సేవలు అభిషేకాలు కుంకుమార్చన వంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మహిళలు ఉపవాస దీక్షతో బియ్యం పిండితో చేసిన సెలిమిడిని జ్యోతులుగా చేసుకొని మేళతాళలతో వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా దేవాలయాలకు చేరుకుని ప్రదక్షిణలు చేసి అమ్మవారికి అర్పించారు. ఈ సందర్భంగా పోతురాజు నాట్యం చేసుకుంటూ ఊరేగింపుగా దేవాలయం చేరుకున్నారు. పోతురాజు నాట్యం చేస్తూ భక్తులను పరవశింప చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదం వినియోగం తో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

***నేడు 16 గ్రామాల జ్యోతుల ఉత్సవాలు..***

పది రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రత్నగిరి పరిసర ప్రాంతాల్లోని 16 గ్రామాల్లో ప్రజలు కొల్లాపూరి మహాలక్ష్మికి జ్యోతులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. వన్నారన్నపల్లి, హనుమంతనపల్లి, హులికుంట, దొమ్మరహట్టి, వన్నప్పపాళ్యం, గిరేనాయన పాళ్యం,దాసప్పపాళ్యం, టీడీపల్లి,కొడగార్లగుట్ట,గిడ్డ బొమ్మనహళ్లి,గ్రామాల్లో జ్యోతుల ఉత్సవాలు చేపట్టనున్నారు.



ప్రత్యేక అలంకరణలో
కొల్లాపూరి మహాలక్ష్మి



నృత్యం చేసుకుంటూ వస్తున్న పోతురాజు. జ్యోతులు మోస్తున్న మహిళలు

## పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగిస్తాం

(మొదటి పేజి (తరువాయి)

తెలిపారు. జూన్ నుంచి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. చెత్త నుంచి ఆదాయాన్ని కూడా సమకూర్చుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కెమికల్ ఫర్టిలైజర్‌ను తగ్గించి బయో ఫర్టిలైజర్ వాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పట్టాభి అన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి అతి తక్కువ ధరకే బయో ఫర్టిలైజర్లను రైతులకు అందిస్తామని తెలిపారు. బయో ఫర్టిలైజర్ అమ్మకాలలో 10 శాతం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుందన్నారు. చెత్త నుంచి రీ సైక్లింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చెత్త రీ సైక్లింగ్ ద్వారా మున్సిపాలిటీలకు 10 శాతం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు 10 శాతం చొప్పున ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 చోట్ల వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలంతా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. పారిశుధ్యంపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు 5 వేల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో అత్యధిక స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెత్త సేకరణను నిరంతర పర్యవేక్షణకు రియల్ టైం డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయబోతున్నామని కొమ్మారెడ్డి పట్టాభిరాం పేర్కొన్నారు.



## కట్టుదిట్టంగా రహదారుల నిర్మాణం

(మొదటి పేజి (తరువాయి)

మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఈ సమీక్షకు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయానికే ప్రజా రవాణా జరిగేలా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదిలావుంటే ఇటీవల తరచూ ప్రమాదాలకు గురవుతూ... ప్రజల ప్రాణాలను బలిగొంటున్న స్లీపర్ బస్సులను అవసరమైతే భవిష్యత్తులో రద్దుచేస్తామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే దీనిపై కేంద్రాన్ని సంప్రదించామని పేర్కొన్నారు. 'ప్రయాణించే రెండు ప్రాంతాల మధ్య దూరాన్ని లెక్కించి బస్సు గమ్యస్థానం చేరాల్సిన సమయాన్ని నిర్దేశిస్తార. అంతకంటే ముందే వెళ్తే బస్సును సిటీలోకి అనుమతించబోం. 300 కి.మీ., అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించే ప్రైవేటు బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిందే. రాత్రిపూట డ్రైవర్ నిద్రపోయేందుకు ఒక సీటు కేటాయించాలి. ఈ విషయాలను ప్రైవేటు బస్సు యాజమాన్యాలకు స్పష్టం చేశాం' అని మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమీక్షించింది. రహదారుల వెంబడి స్పీడ్ గన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరుచేసింది. డ్రైవర్‌ను, ఎదురుగా వచ్చే వాహన కదలికల్ని అంచనా వేసేలా ప్రతి బస్సులో రెండు కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలను ఆదేశించాం' అని వివరించారు. 'కర్నూలు, మారేడుమిల్లి, మార్కాపురం బస్సు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణమని తేలింది.



## క్రీడాభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజి (తరువాయి)

కోట్లను మూడు దశల్లో ఖర్చు చేయనుందని మంత్రి మండిపల్లి తెలిపారు. విజయవాడకు తలమానికంగా నిలిచిన ఈ స్టేడియం గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని మంత్రి మండిపడ్డారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాప్ సమన్వయంతో దీని అభివృద్ధికి జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు. విజయవాడ స్టేడియం అభివృద్ధితోపాటు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా క్రీడల వికాసానికి ఎంపీ అపూర్వ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు నిరంతరం కేంద్ర మంత్రులను కలిసి ఏపీకి కావాల్సిన నిధులను సాధిస్తున్నారని కొనియాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా విజయవాడ ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి శాశ్వత గుర్తింపు రావడంతో విజయవాడకు మహర్దశ పట్టనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అమరావతి ప్రాంతంతో పాటుగా విశాఖ, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగవుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ వెల్లడించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కానుందని, స్పోర్ట్స్ యూనివర్శిటీ కూడా ఏర్పాటు కానుందని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ స్పోర్ట్స్ సిటీని నిర్మించాలని సీఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని శివనాథ్ తెలిపారు. మహిళా క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా కూటమి సర్కార్ ముందుకు సాగుతోందన్నారు. యువ కెరటాలైన అధికారులు జిల్లా యంత్రాంగంలో ఉండటం ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ పాత్ర అత్యంత కీలకమని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. దాని అభివృద్ధి కోసం సుమారు 20 సార్లు స్టేడియానికి వెళ్లి సూచనలు చేసినట్లు ఆయన చెప్పారు. ఎంపీ కేశినేని శివనాథ్ కోరినట్లుగా స్టేడియంలో ఓ బ్లాక్‌కు మహిళా క్రీడాకారిణి పేరు పెడతామని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం రూపు రేఖలు మారిపోనున్నాయని చెప్పుకొచ్చారు శాప్ చైర్మన్. వచ్చే సంవత్సరం ఓ అంతర్జాతీయ క్రీడాకారుడిని స్టేడియానికి తీసుకువచ్చి కార్యక్రమం చేపడతామని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు.



## తీరు మార్చుకోకపోతే ఉపేక్షించం

(మొదటి పేజి (తరువాయి)

పరిటాలశ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహారిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

## కోర్టు తీర్పు వచ్చేవరకూ ఆగలేరా

(మొదటి పేజి (తరువాయి)

భూములతో సంబంధం లేని రైతులను భయభ్రాంతులకు గురిచేయటం దారుణమని మంద కృష్ణ మాదిగ చెప్పారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుల్లో తీర్పు వచ్చేంతవరకు హైడ్రా అధికారులు సంయమనం పాటించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రాపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ షాకింగ్ కామెంట్స్ చేశారు. బుధవారం అమీన్ పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలోని వివాదంలో ఉన్న భూముల రైతులను మంద కృష్ణ మాదిగ, హైకోర్టు అడ్వకేట్ ముఖీం పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడారు. కోర్టు పరిధిలో లేని భూములకు సంబంధించిన రైతుల జోలికి హైడ్రా, రెవెన్యూ అధికారులు రావొద్దని కోరారు. రైతులకు ఉన్న లీగల్ హక్కులకు భంగం వాటిల్లితే సహించబోమని హెచ్చరించారు. ఏదైనా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా దృష్టి పెడితే ఏ సమస్య ఉండదని తెలిపారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

## 148వ శ్రీ అక్కల్కోట్ మహారాజ్ ఆరాధన మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
నగరంలోని హెచ్ఎల్సి కాలనీలో ఉన్న శ్రీ అక్కల్కోట్ మహారాజు ఆశ్రమం, కొల్హాపూర్ మహాలక్ష్మి శ్రీవలి ఆశ్రమంలో అక్కలకోట మహారాజు 148వ ఆరాధన మహోత్సవాల పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శ్రీ అక్కల్కోట్ మహారాజు ఆరాధన ఉత్సవాలు ఉదయం 6:30 నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం క్షీరాభిషేకం, ఆలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారు, అక్కల్కోట్ మహారాజు తో పాటు పరివార దేవతలకు పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా మంగళ హారతి అనంతరం భక్తాదులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం స్వామివారిని రథంలో ఆశీనులను చూసి గ్రామోత్సవంలో భక్తాదులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పుబ్బరాజు విజయకుమార్, నాగ ప్రసాద్, నాగభూషణం,ఆనంద్ కుమార్, లింగాల మల్లికార్జున, శివమ్మ,మాధవి తదితరులు పాల్గొన్నారు



రవికుమార్ కుటుంబానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

## జర్నలిస్టు రవికుమార్ కుటుంబానికి 50,200 ఆర్థిక సహాయం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రవికుమార్ కుటుంబానికి 50,200 ఆర్థిక సహాయాన్ని జర్నలిస్టు సంఘాల నాయకులు అందజేశారు. సంతాప సందర్భంగా దాతలు ఇచ్చిన సహాయంతో కలిపి సీనియర్ జర్నలిస్లు రేపటి రామాంజనేయులు ద్వారా రవికుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతపురం సాహిత్య సాంస్కృతిక సమైక్య ఆధ్వర్యంలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రవికుమార్ సంతాప సభ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. వివిధ సాహిత్య సంస్థలతో కల్చలర్ రిపోర్టర్‌గా రవికుమార్ అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు. కవులు అందరూ కలిసి రవి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకుంటామని, అతని పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కవులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ, ఏలూరు యంగన్న, తరిమెల అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ బి నారాయణ, చంద్రశేఖర్ శాస్త్రి, చెట్ల ఈరన్న, మధురశ్రీ, కొత్తపల్లి సురేష్, కోటి గారి వన్నప్ప, షేక్ రియాజుద్దీన్, డాక్టర్ జూటూరు షరీఫ్, ఆడవాళ శేషగిరి రాయుడు, కుంచె శ్రీ, డాక్టర్ అంకె శ్రీనివాస్, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, సీనియర్ పాత్రికేయులు ఏమినేని రవిచంద్ర, రవిచంద్ర, పయ్యావుల ప్రవీణ్, సందనం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ నకార జయంతి వేడుకలు నిర్వహిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

## పెన్షనర్ల ఆశాజ్యోతి నకార 112వ జయంతి వేడుకలు

**గుత్తి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
మండల కేంద్రంలోని స్థానిక ఫుట్బాల్ గ్రౌండ్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో డి.ఎస్.నకార 112వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో నకార చిత్ర పటానికి కోశాధికారి ప్రెసిడెంట్ అబూబాకర్, జెన్నే కుల్లాయిబాబు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మరియు ముఖ్య అతిథి గా విశ్రాంత డాక్టర్ కృష్ణ గోపాల్ రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు..కేక్ లు ఒకరి కొకరు తినిపించు కున్నారు.డాక్టర్ కృష్ణ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒకసారి నకారని స్మరించుకుని, పదవీ విరమణ చేసిన వారికి నిజమైన నాయకుడు.ఈయన 08.04.1914లో ముంబాయి లో జన్మించారు.ఈయన 1937లో సివిల్ పరీక్ష లో ఉతీర్ణులై ,కేంద్ర ప్రభుత్వ రక్షణ అకౌంట్స్ సర్వీస్ లో చేరారు. ఆయన దాఖలు చేసిన పిటీషన్ పై 1982 డిసెంబర్ 17 న సుప్రీంకోర్టు పింఛన్ అనేది ప్రభుత్వ ,దయా దాక్షిణ్యం కాదని ,అది ఉద్యోగి హక్కు అని చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది అని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, విశ్రాంత డాక్టర్ కృష్ణ గోపాల్ రెడ్డి, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, నారాయణరెడ్డి, సెక్రెటరీ రామ్ మోహన్,వెంకట సుబ్బమ్మ, విజయ లక్ష్మీ, శకుంతలమ్మ,వెంకటేష్, దేవదాస్,శామ్యూల్, చెన్నారెడ్డి, స్వామిదాస్ ,మాబు సాబ్, గోవిందు పాల్గొన్నారు.

## టీం రెహమాన్ ఖాన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**టీ సుండుపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
అధిక వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మండల ప్రజల సౌకర్యార్థం తమ వంతుగా చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పఠాన్ రెహమాన్ ఖాన్ తెలిపారు. మండల కేంద్రంలోని కూడలి వద్ద గల ఐ జైన్ మొబైల్స్ వద్ద ప్రజల సౌకర్యార్థం చల్లనీటి చలివేంద్రం ఏర్పాటు చేశామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఐ జాయిన్ మొబైల్స్ అధినేత జలీల్ సహకారంతో చలివేంద్రాన్ని నిర్వచించడం అభినందించడం అని ఆయన అన్నారు.కార్యక్రమంలో విద్యార్థి భాగం నాయకులు పటాన్ అబ్దుల్లా ఖాన్, పిట్టు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెహమాన్ ఖాన్

# హోరాహోరీగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

### ఆస్వాదిస్తున్న గ్రామస్తులు..

**బెళగుప్ప (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
బెళుగుప్ప ఎన్టీఆర్ క్రికెట్ క్రీడా మైదానంలో సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ,జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరుగుతున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మారెన్న,డైరెక్టర్లు చిన్న తిప్పయ్య,నాగభూషణ పేర్కొన్నారు. ఈనెల ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో కళ్యాణదుర్గం, రాయదుర్గం,ఉరవకొండ, కనేకల్లు, ఆత్మకూరు, తదితర ప్రాంతాల నుంచి సుమారు 40 క్రికెట్ జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ప్రతిరోజు మూడు నాకౌట్ మ్యాచ్ లు జరగగా వాటిలో గెలుపొందిన జట్లలోని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను అందజేస్తున్నారు. బుధవారం జరిగిన నాకౌట్ మ్యాచ్ లలో మొదటి మ్యాచ్ కనేకల్ ఆర్డిటి లెవెన్ జట్టు, హనకనహాల్ మహీ లెవెన్ జట్టుతో తలపడగా నిర్ణీత 10 ఓవర్లలో కనేకల్ ఆర్డిటి జట్టు 119 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హనకనహాల్ మహీ లెవెన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 103 పరుగులు సాధించి ఓటమి పాలయ్యింది. ఇందులో కనేకల్ ఆర్డిటి 11 జట్టు 16 పరుగుల తో విజయం సాధించింది. అనంతరం తిమ్మసముద్రం జట్టు, బెళుగుప్ప ఎమిగోస్ జట్టు తలపడగా నిర్ణీత 10 ఓవర్లలో తిమ్మసముద్రం జట్టు 152 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఎమిగోస్ జట్టు 111 పరుగులు మాత్రమే చేయగా 41 పరుగుల ఆదిక్యంతో తిమ్మసముద్రం జట్టు విజయం సాధించింది. అలాగే మూడో నాకౌట్ మ్యాచ్ లో బెళుగుప్ప బిల్లా లెవెన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 101 పరుగులు సాధించగా, అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హనకనహాల్ స్వామి లెవెన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 96 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో బిల్లా లెవెన్ జట్టు 5 పరుగుల ఆదిక్యంతో విజయం సాధించారు. ఈ నాకౌట్ మ్యాచ్ లో గెలుపొందిన జట్ల లోని మేన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించిన ఆటగాళ్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మెమెంటోలను సన్ రైజర్స్ స్కూల్ పాఠశాల యాజమాన్యం మారెన్న, చిన్న తిప్పయ్య, నాగభూషణ అందజేశారు. ఈ నాకౌట్ మ్యాచ్ లు 11వ తేదీ వరకు జరగగా 12వ తేదీ క్వార్టర్ ఫైనల్, 13వ తేదీ సెమీఫైనల్, 14వ తేదీ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని వారు పేర్కొన్నారు..



బెళుగుప్పలో బుధవారం జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో తలపడిన బిల్లా లెవెన్ జట్టు, హనకనహాల్ స్వామి లెవన్ జట్టు



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఆటగాళ్లకు మెమెంటోలు అందిస్తున్న సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాం ఎమ్మెల్యేను కలిసిన ప్రభుత్వ వైద్యులు

**పామిడి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ గుమ్మానూరు జయరాం పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసరుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మహేష్ కుమార్ అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్‌తో కలిసి బుధవారం ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాంను కలిశారు. ఇక్కడ మెడికల్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివాకార్తీకరెడ్డి కదిరికి బదిలీ కావటంతో ఆయన స్థానంలో డాక్టర్ మహేష్ కుమార్ నియమితులైన విషయం తెలిసిందే. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న సేవలు, ఆపరేషన్లను సైతం ఇక్కడే చేస్తున్నామని డాక్టర్ మహేష్ కుమార్ ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాంకు వివరించారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, ఎన్సీడీ వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ, అభివృద్ధి సౌకర్యాల కల్పన ఇతరత్రా సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే గుమ్మానూరు జయరాం రోగులకు మెరుగైన సేవలను అందించాలని సూచిస్తూ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసిన డాక్టర్ మహేష్ కుమార్, చిలకల రాజగోపాల్

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

### జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి.. 10 నుండి అనంతపురం నుండి బండ్లపల్లి వరకు పాదయాత్ర.. 12న బండ్లపల్లిలో భారీ బహిరంగసభ.. పోస్టర్ విడుదల.. సిపిఐ మండల కార్యదర్శి వి వెంకట రాముడు యాదవ్..

**యాడికి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరిగే పాదయాత్ర పోస్టర్లులను పెద్దవడుగూరు మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు సిపిఐ మండల కార్యదర్శి వి వెంకట రాముడు యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ పేద కూలీలకు చిన్న చిన్నకారు రైతులకు బాసటగా ఉన్న మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి దాని స్థానంలో ఎలాంటి హక్కులు లేనేటువంటి వి బి జి రామ్ జి పథకాన్ని ప్రవేశపెట్టి గ్రామీణ ఉపాధి పథక చట్టాన్ని తూట్లు పొడిచిందన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వం గతంలో కేంద్రం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులు భరించేదని, కొత్తగా తెచ్చిన చట్టం వలన రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అదనంగా భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ అంశాల పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు ప్రజా కార్మిక కర్షక విధానాలకు వ్యతిరేకంగా చేస్తున్న అరాచకాలు అడ్డుకోవాలని అంశంపై మూడు రోజులు పాటు జరిగే ఈ పాదయాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి అనంతపురం మాజీ ఎమ్మెల్యే కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య , రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి జగదీష్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, జిల్లా కార్యదర్శులు పాల్యం నారాయణ స్వామి, వేమయ్య యాదవ్. జాతీయ రాష్ట్రస్థాయి జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు శ్రేణులు పాదయాత్రలో పాల్గొంటారన్నారు. ఉపాధి శ్రామికులు కర్షకులు అందరుపాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వడుగూరు నారాయణ, తాడపత్రి రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఆదినారాయణ సిపిఐ నాయకులు రంగనాయకులు, హుస్సేన్ పీరా,నాగేంద్ర, నాగయ్య, శ్రీనివాస్, రెడ్డి,దౌల, మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో పాదయాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు


# టీడీపీ సభ్యత్వం ఇన్సూరెన్స్ బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

### వెంకటాద్రిపల్లి చంద్రమౌళి కుటుంబానికి 5 లక్షల ఇన్సూరెన్స్ బీమా చెక్కు పంపిణీ.. మంత్రి పయ్యావుల కేశవ్..

**బెళగుప్ప (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా ఇస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.బెళుగుప్ప మండలం పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామానికి చెందిన చంద్రమౌళి గత సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉండటంతో, పార్టీ ఇన్సూరెన్స్ పథకం ద్వారా చంద్రమౌళి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించబడింది. బుధవారం ఉరవకొండ లోని పార్టీ కార్యాలయం లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతులమీదుగా చంద్రమౌళి భార్య శకుంతలమ్మకు రూ.5 లక్షల భీమాను అందజేశారు. ఈ సహాయం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించామని మంత్రి తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఆర్థిక భరోసా అందించే విధంగా ఈ ఇన్సూరెన్స్ పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని రాధాకృష్ణ, అమిలి నేని హర్షవర్ధన్, నెట్టెం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటాద్రిపల్లి చంద్రమౌళి కుటుంబానికి 5 లక్షల ఇన్సూరెన్స్ అందించిన మంత్రి పయ్యావుల



## ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు చిరస్మరణీయం

**యాడికి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన స్పానిష్ మానవతావాది ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. ఈయన 1920 ఏప్రిల్ 9న స్పెయిన్‌లోని బార్సిలోనాలో జన్మించారు. పేదల కోసం అవతరించిన మహనీయుడు. ఈయన 1968లో రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ (ఆర్టీటి )ని స్థాపించి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. ఫాదర్ ఫెర్రర్ పేద పిల్లల కోసం అనేక ఉచిత పాఠశాలలను స్థాపించారు. వారికి భోజనం, పుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందజేస్తూ విద్యను అందుబాటులోకి తెచ్చారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. ప్రజారోగ్యం కోసం ఫెర్రర్‌విశేషంగా కృషి చేశాడు. బత్తలపల్లిలో అత్యాధునిక ఆసుపత్రిని నిర్మించి, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. తరచూ కరువు కాటకాలతో ఉమ్మడి అనంతపురం జిల్లా అతలాకుతలం అయ్యేది, సమస్యను గుర్తించిన ఫాదర్ ఫెర్రర్ వేలాది పాడైపోయిన బోరుబావులను, చెరువుగట్టులను పునర్నిర్మించి రైతులకు సాగునీటిని అందించారు. పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మహిళం వారికి మానసిక ఎదుగుదల అయ్యే విధంగా తోడ్పడ్డాడు. తలసీమియా చిన్నారులకు పునర్జన్మ అభ్యున్నతి కోసం ఫాదర్ ఫెర్రర్ ప్రత్యేక స్వయం ఉపాధి శిక్షణలు ఇచ్చి ఆర్థికంగా ని ప్రోత్సహించారు. మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా మెరుగు పరిచారు. బుద్ధి మాధ్యత కలిగిన చిన్నారులను ప్రోత్సహిస్తూ వారికి విద్యాల విద్యాలయాలు నిర్మించి ప్రత్యేక బోధనల ద్వారా ప్రసాదిస్తూ ఆయన దేవుడయ్యాడు. అలాగే యాడికి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం నిర్మాణం చేపట్టారు యాడికి మండలంలో ఎన్నో చెక్ డాములు నిర్మించారు. అలాగే ఇళ్లు లేని నిరుపేదల కోసం వేలాది ఇళ్లను నిర్మించారు. వికలాంగుల కోసం ప్రత్యేక పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కుల, మత భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తూ వారికి సహాయం అందించారు. ఫాదర్ ఫెర్రర్ చేసిన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2009లో ఆయన మరణించినప్పటికీ, ఆయన స్థాపించిన ఆర్టీటి సంస్థ ద్వారా నేటికీ ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సేవలు అందిస్తోంది. ఫాదర్ ఫెర్రర్ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి. ఆయన సేవలు ఎప్పటికీ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచి ఉంటాయి. ఆయన జ్ఞాపకార్థం యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో సీతారాముల విగ్రహాలు

## భక్తిశ్రద్ధలతో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

### కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం..

**టీ సుండుపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కడప జిల్లా టి సుండుపల్లె మండలం మడితాడు పంచాయతీ బైనేనివారిపల్లెలో అత్యంత భక్తిశ్రద్ధల నడుమ ఆంజనేయ లక్ష్మణ సమేత సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేదోక్తంగా అర్చకులు గడియారం సుబ్రహ్మణ్యం శర్మ, ఆలూరు అభిషేక్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నిర్వకులు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో నవగ్రహ, గణపతి, లక్ష్మి వాస్తు హోమాలలో పాల్గొన్నారు.సీతారాములా యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ట అనంతరం సీతారాములకు కల్యాణ క్రతువును కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామస్తులు పూజా కార్యక్రమాల అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



క్రతువులో పాల్గొన్న గ్రామస్తులు

## ముఖ్యమంత్రితో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ

**అమరావతి, ఏప్రిల్ 8:**
ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీ–విద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని వెల్లడించింది.



## 18న అగళి మండల సర్వసభ్య సమావేశం

ఏఓ రాజేంద్రప్రసాద్..

అగళి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తప్పనిసరిగా వారి శాఖ పరిధిలో జరిగిన నివేదికలతో హాజరు కావాలని కోరారు. అట్లు హాజరుకాక పోయిన యెడల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు. అదేవిదంగా జడ్పీటీసీ,ఎంపీటీసీ లు వివిధ హోదా కలిగిన ప్రభుత్వ ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.


భౌతికకాయనికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపి నాయకులు

## స్వాతంత్ర్య సమరయోధులు మెలవాయి గోవిందరెడ్డి మృతికి సంతాపం

రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 8 :
మడకశిర మండలం మెలవాయి గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మెలవాయి గోవిందరెడ్డి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ కుంచిటీగా వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ, గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, మల్లేగౌడ్, తిమ్మారెడ్డి రాజశేఖర్ తదితరులు సంతాపం తెలిపారు. అయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.


ఇన్చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన రామారావు

## ఇన్చార్జ్ ఎంపీడీవోగా రామారావు

రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 8 :
స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో గా రామారావు బాధ్యత చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో నాగేశ్వరావు శాస్త్రి అనారోగ్య పరిస్థితుల కారణంగా సెలవు పై వెళ్లడంతో ఆయన స్థానంలో అమరాపురం మండలం ఎంపీడీవో రామారావును ఇన్చార్జ్ ఎంపీడీవో గా నియమించారు. ఈయన గతంలో రెగ్యులర్ ఎంపీడీవో గానూ ఇన్చార్జ్ ఎంపీడీవో గాను విధులు నిర్వహించారు.

## రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు

అమరావతి, ఏప్రిల్ 8:
రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఎండతీవ్రత, పిడుగులతో కూడిన అకాల వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా మన్నార్ వరకు ద్రోణి కొనసాగుతుందని తెలిపారు. దీని ప్రభావంతో గురువారం కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం 5 గంటల నాటికి తూర్పుగోదావరి(జి) పైడిమెట్టలో 44మిమీ, కాకినాడ(జి) డి.పోలవరంలో 37.7మిమీ, తూర్పుగోదావరి(జి) సీతానగరంలో 32.2మిమీ, అనకాపల్లి(జి) పాయకరావుపేటలో 26మిమీ చొప్పున అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. మరోవైపు రాయలసీమ జిల్లాల్లో ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం పల్నాడు(జి) క్రోసూరు, తిరుపతి (జి) వరదయ్యపాలెంలో 42.2 డిగ్రీలు, చిత్తూరు(జి) నగరిలో 42.1డిగ్రీలు, నంద్యాల(జి) చాగలమర్రిలో 41.9 డిగ్రీలు, కడప(జి)పులివెందులలో 41.8డిగ్రీలు, అనంతపురం(జి) తెరన్నపల్లిలో 41.7డిగ్రీలు, కర్నూలు(జి) తోవి, మార్కాపురం(జి) అనుములపల్లెలో 41.6డిగ్రీలు నమోదైంది.

# నీరు ఉంటేనే అభివృద్ధి.. నీటిని కాపాడుకుందాం

### జలధార-నీటి భద్రత కార్యక్రమం ప్రారంభం.. త్వరలో పీఏబీఆర్-హంద్రీనీవా కాలువల అనుసంధానం.. రైతులు, సాగునీటి సంఘాలు భాగస్వామ్యం కావాలి.. ధర్మవరం నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ..


జలధార -నీటి భద్రత కార్యక్రమంలో మాట్లాడుతున్న యువనేత పరిటాల శ్రీరామ్


బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
నీరు ఉన్న ప్రాంతాల్లోనే వ్యవసాయం, అభివృద్ధి సాధ్యమవుతాయని, అందుకే ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో నిర్వహించిన జలధార--నీటి భద్రత--సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న శ్రీరామ్‌కు టీడీపీ నాయకులు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చెరువుల అభివృద్ధి, నీటి వినియోగంపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో గతంలో నీటి వనరులు చాలా తక్కువగా ఉండేవని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన నీరు--చెట్టు కార్యక్రమాలు, హంద్రీనీవా కాలువ పూర్తి చేయడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రస్తుతం కొంతవరకు నీటి సమస్య తగ్గిందంటే అది చంద్రబాబు కృషి ఫలితమేనని పేర్కొన్నారు. హంద్రీనీవా నీరు మన ప్రాంతానికి చేరేందుకు భారీ వ్యయం జరుగుతోందని, అందువల్ల అందిన నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసి భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 49 చెరువులకు నీరు అందించేందుకు హంద్రీనీవా కాలువతో అనుసంధానం చేసే పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. దీనివల్ల చెరువులు నిండి రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, కాకర్ల సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, రైతు సంఘం అధ్యక్షుడు చల్లా శీనా, యూనిట్ ఇంచార్జ్ బత్తల మనోజ్, బీజేపీ నాయకులు భాస్కర్, చంద్రశేఖర్, శ్రీరాములు, బోయపాటి అప్పు, సాగునీతి సంఘం అధ్యక్షుడు నరేంద్ర, మరినేని కిరణ్, ఆదినారాయణ, వడ్డే రాజు, ముసలప్ప, కొండన్న, సాంబ, మారుతీ, రాజు, చల్లా నాయుడు, లోకనాథ్, చిట్రా నాగభూషణం, దురగమప్ప, కుంటాల రాము, రమణప్ప, తిరుపతీ నాయుడు, శీనా, శివయ్య, నాయుడు, శేఖర్ వెంకటరాముడు, సాయి, మూళ్ళగురు సూరి, సూరి, చౌదరి, బోయపాటి రాము, తరిగొపుల చౌదరి, దేరంగుల ప్రతాప్, వీరా, దేరంగుల హరి, జంపుల రవి, మౌలా, కృష్ణయ్య, యర్రప్ప, బాలకృష్ణ, అధికారులు, డిఈ గురుప్రసాద్, ఎంపీడీవో నరసింహనాయుడు, తహసిల్దార్ స్వర్ణ లత, జేఈ మురళి, వీఆర్వో ముత్యాలు, సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు..


నాయకులతో కలిసి కుడి కాలువను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

## మనిషి రూపంలో మానవత్వం

### ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అజరామర సేవాగాథ .. కరువు నేలపై కరుణ విత్తిన మానవతావాది.. పేదల జీవితాల్లో వెలుగులు నింపిన శాశ్వత స్ఫూర్తి.. ఎఫ్సిఆర్ఏ పునరుద్ధరణతో ఆర్డిటి సేవలకు కొత్త ఊపిరి ..

బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
ఎండలతో ఎండిపోయిన నేల... ఆశలు కోల్పోయిన కుటుంబాలు... నీటి కోసం, విద్య కోసం, ఆరోగ్య కోసం పోరాడిన జీవనాలు,ఇవి ఒకప్పుడు అనంతపురం జిల్లా వాస్తవం. అలాంటి నేలపై ఆశల విత్తనం వేసి, దానిని వృక్షంగా పెంచిన మహనీయుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్. ఆయన జీవితం ఒక సాధారణ సేవ కాదు,ఒక మౌన విప్లవం. ఏప్రిల్ 9 జయంతి సందర్భంగా ఫెర్రర్ సేవలను స్మరించుకోవడం అంటే, వేలాది కుటుంబాల నవ్వులను గుర్తు చేసుకోవడం. స్పెయిన్‌లో జన్మించిన ఆయన, భారతదేశాన్ని తన గుండెలో దాచుకుని, పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 1969లో ప్రారంభమైన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ), నేడు లక్షలాది మందికి ఆధారంగా నిలవడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. కరువు కాటకాలతో బాధపడే ఈ ప్రాంతంలో చెరువుల పునరుద్ధరణ, బోరుబావుల మరమ్మతులు చేపట్టి సాగునీటిని అందించడం ద్వారా రైతులకు జీవనాధారం కల్పించారు. ఎండిన నేలల్లో పండ్ల మొక్కలు నాటించి, రైతుల జీవితాల్లో పచ్చదనాన్ని నింపారు. ఇది కేవలం అభివృద్ధి కాదు,జీవన పునర్నిర్మాణం. విద్యను ఆయుధంగా మార్చిన ఫెర్రర్, పేద పిల్లల కోసం ఉచిత పాఠశాలలు ఏర్పాటు చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేశారు. బాలికా విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో సమానత్వానికి పునాది వేశారు. పుస్తకాలు, భోజనం, దుస్తులు వంటి అన్ని సదుపాయాలతో విద్యను హక్కుగా మార్చారు.



విద్యారంగం లో ఆయన చూపిన దారి దీపం మరింత విశిష్టం. విద్య సమానత్వానికి వంతెన అన్న నమ్మకంతో పేద పిల్లలకు ఉచిత విద్య అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దారు. ముఖ్యంగా బాలికల కు విద్య అందించడం ద్వారా సమాజంలో నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికారు. ఆరోగ్య రంగంలో బత్తలపల్లి ఆసుపత్రి పేదల ప్రాణాధారం. నాణ్యమైన వైద్యం అందుబాటులో లేక బాధపడే ప్రజలకు ఈ ఆసుపత్రి ఆశ్రయంగా మారింది. వికలాంగులకు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి గౌరవప్రదమైన జీవితం అందించారు. మహిళల సాధికారతలో ఆయన చూపిన మార్గం విశేషం. స్వయం ఉపాధి శిక్షణలు, మహిళా సంఘాల ద్వారా వేలాది మహిళలను ఆర్థికంగా బలపరిచారు. వారి చేతుల్లో సంపాదన, వారి జీవితాల్లో స్వాభిమానం నింపారు. ఇటీవల ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ లభించడం, ఈ సేవా యజ్ఞానికి మరింత బలం చేకూర్చింది. ఇది కేవలం సంస్థకు అనుమతి మాత్రమే కాదు,పేదల జీవితాల్లో మార్పు కొనసాగుతుందనే నమ్మకం. 2009లో ఫెర్రర్ భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన ఆలోచనలు, ఆశయాలు ప్రతి గ్రామంలో, ప్రతి చిరునవ్వులో సజీవంగా ఉన్నాయి. ఆయన నిర్మించిన ఇళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు కేవలం గోడలు కాదు, మానవత్వానికి నిలువెత్తు సాక్షాలు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేరు ఒక జ్ఞాపకం కాదు... అది ఒక భావన. పేదల కళ్ళల్లో కనిపించే ఆశ, మహిళల జీవితాల్లో వచ్చిన మార్పు, పిల్లల భవిష్యత్తులో మెరిసే వెలుగు, ఇవన్నీ ఆయన సేవల ప్రతిబింబాలే. ఆయన చూపిన మార్గం, ఆయన నాటిన విలువలు, ఆయన అందించిన ఆశలు... ఇవన్నీ తరతరాలకు వెలుగునిస్తూనే ఉంటాయి. ఈ జయంతి సందర్భంగా ఒక నిజం మరింత స్పష్టమవుతోంది, ఫెర్రర్ జీవితం ముగిసినా, ఆయన సేవా గాథ ఎప్పటికీ ముగియదు. ఆయన చూపిన మార్గం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇంకా వెలుగులు నింపుతూనే ఉంది.



## తాటిమానిగుంత పాఠశాల ఆకస్మిక తనిఖీ

### మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన .. మౌలిక వసతుల మెరుగుదలకు హామీ.. విద్యార్థుల ప్రగతిపై సమీక్ష.. తహశీల్దార్ దేవేంద్ర నాయక్..

నంబులపూలకుంట (తెలుగోడు), ఏప్రిల్ 8 :
నంబులపూలకుంట మండలం వెలిచెలమల గ్రామ మజారా తాటిమానిగుంతలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తహశీల్దార్ దేవేంద్ర నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సమగ్రంగా ఆరా తీసి, విద్యార్థుల విద్యా ప్రగతిని సమీక్షించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. భోజనం పరిశుభ్రంగా, పోషకాహారంతో ఉండేలా చూసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో ముచ్చటించిన తహశీల్దార్, చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల భవనంలో ఉన్న మరమ్మత్తుల అవసరాన్ని గమనించిన ఆయన, సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు తగిన చర్యలు తీసుకుని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందికి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న తహశీల్దార్ దేవేంద్ర నాయక్

## ఉపాధ్యాయుడు ఆనందప్ప సేవలు అభినందనీయం

### ఎంఈఓలు కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్ నాయుడు..

అగళి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
మండల పరిధిలోని ఎం గొల్లహట్టి గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆనందనప్ప సేవలు అభినందనీయమని ఎంఈఓలు కృష్ణమూర్తి రాజు, చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన సందర్భంగా అగళి ఎంఆర్‌సీలో ఎంఈఓల ఆధ్వర్యంలో ఆనందప్పకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు మాట్లాడుతూ ఆనందప్ప పనిచేసింది అనతి కాలం అయినా విద్యార్థుల స్థాయికి దిగి వారితో మమేకమై పాఠాలు బోధించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు భవిష్యత్ కోసం అవసరమైన జ్ఞానాన్ని అందించడంలో ఆయన సఫలీకృతుడైనారని అన్నారు. ఆనందప్ప సేవలను విద్యార్థులు జీవితాంతం గుర్తించు కొంటారన్నారు. ఆనందప్ప సేవలను ప్రశంసిస్తూ పలువురు ఉపాధ్యాయులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆనందప్పను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


గోవింద్ రెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న బిజెపి నాయకులు

## స్వాతంత్ర సమరయోధుడు, న్యాయవాది మెలవాయి గోవిందరెడ్డి మృతి

బిజెపి రాష్ట్ర నాయకులు ఎస్.చంద్రశేఖర్ శ్రద్ధాంజలి..

అగళి (తెలుగోడు), ఏప్రిల్ 8 :



మడకశిర మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో నివసిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు సీనియర్ న్యాయవాది గోవింద్ రెడ్డి బుధవారం ఉదయం 8:30 గంటలకు మృతి చెందారు. ఒక మంచి సమరయోధుడిని పోగొట్టుకున్నాం అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు మడకశిర సింగిల్ విండో డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు శ్రీకాంత్, చిన్ని,సీ ఎల్ లెంకప్ప, నాగరాజు, బాణుదస్, నారాయనప్ప, పాల్గొని గోవిందరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.


బోరు బావిలో దింపిన కొత్త జిఐ పైపులు

## తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీకి ధన్యవాదాలు

ఐ తొనసనపల్లి గ్రామ ప్రజలు..

అగళి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
తాగు నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఇనగలూరు పంచాయితీ ఐ తొనసనపల్లి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు. ఐ తొనసనపల్లి గ్రామ ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న సమయంలో పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్ దృష్టికి తీసుకోపోవడం జరిగింది ఆయన వెంటనే స్పందించి ఆ గ్రామంలో భీమన్న ఇంటి దగ్గర ఉన్న పీడబ్ల్యూ పథకంలో వేయించిన బోరులో నీరు అడుగంటిపోయిన విషయం తెలుసుకున్న పంచాయతీ అభివృద్ధి అధికారి రంగనాథ్ వెంటనే సమస్యను పరిష్కరించుట కొరకై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు వేసవికాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా పంచాయతీకి పంపించిన కొత్త జిఐ పైపులలో ఆరింటిని (6) అలాగే కేబుల్ ను బోరు బావిలోకి దింపి సమస్యను పరిష్కరించడం జరిగింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. ఈ సమస్య ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ల వల్లనే తీరిందని ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారని పంచాయితీ అభివృద్ధి అధికారి (పిడిఓ) రంగనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తో పాటు స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ నరసింహప్ప గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్ గౌడ్, ఎస్ఐ సోమశేఖర్

## ఉద్యోగులకు బదిలీలు సహజం

ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ గౌడ్ ..

బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 8 :
ఉద్యోగాలలో బదిలీలు సర్వసాధారణమని, విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే ప్రజల గుర్తింపు చిరస్థాయిగా నిలుస్తుందని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ గౌడ్, బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ పేర్కొన్నారు. బుధవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో సానుభూతితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తే ప్రజలు దేవుడిలా భావిస్తారని తెలిపారు. విధులు ఎక్కడ చేసినా సమయపాలన, కర్తవ్యనిష్ఠతో పనిచేయాలని సూచించారు. తరువాత బదిలీపై వెళ్తున్న సిబ్బందిని శాలువాలు కప్పి సన్మానించారు.

## ఉపాధి హామీ పనుల్లో పాల్గొని గరిష్ట వేతనం పొందండి

ఎంపీడీవో అంజనప్ప

నల్లమాడ (తెలుగోడు), ఏప్రిల్ 8 :
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో గ్రామీణ కార్మికులు విస్తృతంగా పాల్గొని గరిష్ట వేతనం పొందాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంజనప్ప సూచించారు. బుధవారం నల్లమాడ మండలంలోని దొన్నికోట గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన, ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులు, మస్టర్లు తదితర వివరాలను సమగ్రంగా తనిఖీ చేసిన అంజనప్ప, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. "ప్రతి కార్మికుడు ఈ పనుల్లో తప్పనిసరిగా పాల్గొని రోజుకు గరిష్టంగా రూ.307 వరకు వేతనం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. "ఉపాధి హామీ పనుల్లో పాల్గొనని కార్మికుల జాబ్ కార్డులు నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. కాబట్టి అందరూ తప్పనిసరిగా పనులకు హాజరై ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అంజనప్ప హెచ్చరించారు.


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అంజనప్ప



రహదారుల మలుపుల వద్ద జేసిబితో కంప చెట్లను తొలగిస్తున్న పోలీసులు

## రహదారుల మలుపుల వద్ద కంప చెట్లను తొలగించిన పోలీసులు

**కోసిగి (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కోసిగి నుండి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన మరియు ఉప రహదారులలోని మలుపుల వద్ద గుంపులుగా పెరిగిన చెట్లు, పొదల జేసిబి తో తొలగించినట్లు కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర అడవి వృక్షావరణం కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక పోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రదేశాలను గుర్తించడం జరిగిందని. ముఖ్యంగా బ్లైండ్ కర్వ్ మరియు నారో రోడ్ల వద్ద ఈ సమస్య ఎక్కువగా కనిపించడంతో, ప్రయాణికుల భద్రతకు ముప్పుగా మారుతున్నదని గుర్తించినట్లు తెలిపారు. అట్టి ప్రమాదావకాశాలు ఉన్న ప్రదేశాలలో రోడ్డు విజిబిలిటీ మెరుగుపరచడం మరియు రహదారి భద్రతను పెంపొందించడం లక్ష్యంగా జేసీబీ యంత్ర సహాయంతో చిన్నచిన్న చెట్లు, పొదలు మరియు అడ్డంకిగా ఉన్న మొక్కలను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు . ఈ చర్యల వల్ల రహదారులపై వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించి, ప్రమాదాల నివారణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగించబడుతూ, అవసరమైన ప్రదేశాలలో మరింత శుభ్రపరిచే పనులు చేపట్టి ప్రజల భద్రతను కాపాడుటకు చర్యలు తీసుకుంటా మని ఎస్సై రమేష్ రెడ్డి అన్నారు.కాగా రహదారుల వెంట ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు కంప చెట్లను తొలగించ కుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆర్ అండ్ బి అధికారులపై ఆయా గ్రామాల ప్రజలు, మరియు వాహనదారులు మండిపడుతున్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న వైకాపా నేతలు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న వైకాపా నేతలు

**జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి, దేశాయ్ ప్రహ్లాద ఆచారి ..**

**కౌతాళం (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కౌతాళం మండలం అగసులదిన్నె గ్రామంలో వైఎస్ఆర్సిపి కార్యకర్త కురువ మహాదేష్ కుమారుడు వివాహానికి జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి, దేశాయ్ ప్రహ్లాద ఆచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ పాలు దినకర్, మాజీ వైస్ సర్పంచ్ సక్రి తిక్కయ్య, మండల నాయకులు ఎన్టీఆర్ నగర్ బాష, బెస్త మర్రి స్వామి, ఖలీల్ భాషా, రామ్మూర్తి, కార్యకర్తలు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ పాల్గొన్నారు మరియు అగసులుదిన్నె నాయకులు శ్రీకాంత్ గౌడ్, మల్లి గౌడ్ వీరభద్ర గౌడ్ ఈరన్న , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న వైకాపా నేతలు



ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీ భీమరాయ స్వామి. రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు. రథోత్సవం సందర్భంగా ఎస్ఐ మారుతి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించిన దృశ్యం

# వైభవంగా శ్రీ భీమరాయ స్వామి మహా రథోత్సవం

### ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీ భీమరాయ స్వామి ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వెలసిన శ్రీ భీమరాయ స్వామి మహా రథోత్సవం బుధవారం అశేష భక్తవాహిణి నడుమ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు స్వామి ఉదయం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు స్వామివారికి గణపతి పూజ, లింగార్చన, ఆకుపూజ, కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 5 గంటలకు గ్రామ పెద్ద పారెడ్డి తిమ్మారెడ్డి ఇంటి నుంచి పూర్ణ కుంభం, కలసంతో ఊరేగింపుగా సుందరంగా అలంకరించిన స్వామివారి రథం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథానికి గజమాలతో అలంకరించారు. శ్రీ సద్గురు తాత ఇంటి నుంచి ఉత్సవమూర్తిని మేళతాళాలతో గుడి దగ్గరకు వచ్చి రథోత్సవంపై అధిష్టించి అశేష భక్తవాహిణి నడుమ భీమరాయ స్వామి మహా రథోత్సవం రమణీయంగా సాగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి శ్రీ భీమరాయ స్వామి రథోత్సవాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు.

**శ్రీ భీమరాయ స్వామికి పలువురు ప్రత్యేక పూజలు..**
శ్రీ భీమరాయ స్వామి మహా రథోత్సవాన్ని వు ర న్క రి ం చు కొ ని పలువురు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ కురువ వెంకటేష్, మాజీ సర్పంచులు మల్లమ్మ, విరుపాక్షి రెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు నరవ విరుపాక్షిరెడ్డి, సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న, టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ యంకన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ బూత్ విభాగం తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఉసేని, వైసీపీ నాయకులు ఆంజనేయులు, ఎద్దుల బసన్న శ్రీ భీమరాయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



అశేష భక్తవాహిణి నడుమ శ్రీ భీమరాయ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**గట్టి పోలీసు బందోబస్తు..**
శ్రీ భీమరాయ స్వామి రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మారుతి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు . రథోత్సవానికి హాజరైన వైసీపీ నాయకులు

# ప్రతి నీటి బొట్టు విలువైనదే

### నీటి సంరక్షణకు సంకల్పం.. నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంపై అవగాహన .. జేఈ సంజీవ్ కుమార్..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలం నౌలేకల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఇరిగేషన్ శాఖ జేఈ సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామంలోని సాగునీటి సంఘాల సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఈ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం 90 రోజుల పాటు గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం ప్రతి నీటి బొట్టును సంరక్షించడం, నీటి వనరులను కాపాడుకోవడం మరియు వ్యవసాయానికి సమర్థంగా వినియోగించడం అని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లోని చెరువులు, కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలిస్తూ వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీటి వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే సాగునీటి సంఘాలు చురుకుగా వ్యవహరించి రైతులతో సమన్వయం చేసుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఇక రైతులు కూడా నీటిని వృథా చేయకుండా సూక్ష్మ సాగు విధానాలు, నీటి పొదుపు పద్ధతులను అవలంబించాలని సూచించారు. గ్రామస్థులు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకుని నీటి వనరులను కాపాడుకోవడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నీటి వనరుల పరిరక్షణపై అవగాహన పెంచడంతో పాటు చెరువులు, కాల్వలు, నీటి ప్రవాహ మార్గాలను శుభ్రపరచడం, మరమ్మతులు చేయడం వంటి చర్యలు చేపట్టనున్నారు అని అధికారులు తెలిపారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, నీటి సంరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలు మరియు అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఈ సంజీవ్ కుమార్



నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న జేఈ సంజీవ్ కుమార్



మాట్లాడుతున్న సమతా సైనిక్ దళ్ రంగయ్య

## ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

**సమతా సైనిక్ దళ్ రంగయ్య**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
హైదరాబాద్ ఆంధ్రజ్యోతి కార్యాలయం ముట్టడి, దాడికి వైకాపా నేతలు యత్నించడం అప్రజాస్వామికం అని సమతా సైనిక్ దళ్ రంగయ్య తీవ్రంగా ఖండించారు. ఏదైనా చట్టపరమైన చర్యలతో ముందుకు వెళ్ళాలి గాని ఇలా పత్రికలు కార్యాలయల పై వైసీపీ రౌడీ ముకలతో దాడులు చేయడం మీడియా స్వేచ మరియు ప్రజాస్వామ్యం పై దాడి అని అయన మండిపడ్డారు.గతంలో వైసీపీ పాలనలో మీడియా సంస్థల పై ఆంధ్రజ్యోతి పై అనేక వేధింపులకు పాల్పడిన నిబ్బరం గా నిలిచాయి అని ఆయన పేర్కొన్నారు. ఏకంగా ఎమ్మెల్యే లు రౌడీ మూకలను వెంట వేసుకుని మీడియా కార్యాలయం పై దాడి కి వెళ్లడం వైసీపీ విష సంస్కృతి కి నిదర్శనం అని అయన మండిపడ్డారు.ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ గారు దశాబ్దాలు గా కేసులుకు ఒత్తిడిలకు భయపడకుండా ప్రజా గళం వినిపించే పత్రికను ఛానెల్ ను నడుపుతున్నారు అని జర్నలిజం లో తనకంటూ ఒక బ్రాండ్ ని ఏర్పార్చుకున్నారు అని రంగయ్య గారు తెలిపారు.అమరావతి రాజధాని పై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక దాడులు నిరసనలు తో డైవర్షన్ పాలిటిక్స్ కి పాల్పడుతుంది అని అయన తెలిపారు. వైసీపీ బెదిరింపులు దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ దాడిని అన్నీ సామాజిక ప్రజా సంఘాలు ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము నర్సింహా శ్రీను యల్లప్ప సమతా సైనికులు పాల్గొన్నారు.



నాట్స్ (ముడులు)లను పరీక్షిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

# స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు విపత్తులపై శిక్షణ కార్యక్రమాలు


**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఏప్రిల్ 8 :**
భారత్ స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు విపత్తులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మిగనూరు మండలం పరధిలో బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6 వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరిగే రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం రాష్ట్రాల నుంచి 19 నవోదయ విద్యాలయాల భారత్ స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులు 303 మంది పాల్గొన్నారు. ఈ క్యాంప్ 5 రోజులు నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపులో భాగంగా మూడవ రోజు వివిధ విపత్తులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం భారత్ స్కౌట్స్ గైడ్స్ జెండా ఆవిష్కరించి కార్యాక్రమాన్ని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఈ . పద్మావతి ప్రారంభిచారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్, నాట్స్ (ముడులు)లను పరీక్షించారు. తరువాత ప్రథమ చికిత్సపై విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. మధ్యాహ్నం ఎస్టిమేషన్( వస్తువు ఎత్తు, దూరం ఊహించడం), స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క లాగ్ పుస్తకాలను పరీక్షించారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఈ.పద్మావతి మాట్లాడుతూ "చదువుకు క్రమశిక్షణ తోడైతే బంగారానికి పరిమళం అబ్బినట్లుంటుంది" సర్వేపల్లి రాధా కృష్ణన్ మాటలివి. నవోదయాలో ఉన్నత చదువులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సేవాభావం, దేశభక్తి , క్రమశిక్షణ అలవర్చుకొనేలా ప్రత్యేక శిక్షణ ఇస్తూ తీర్చిదిద్దుతున్నారు , సేవా కార్యక్రమాలతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్ , అడ్మినిస్ట్రేటర్ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. కర్ణాటకకు చెందిన సభ్యులు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగుతుందని తెలియజేసారు. తరువాత విద్యార్థులకు విపత్తుల సమయంలో చేయవలసిన పనుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ బాబూరావ్ నింబూరె, గైడ్ కెప్టెన్ శైలజ , శిక్షణ పరిశీలకులు రమేష్ , శివ కుమార్ ,రాజు , అలాగే విద్యాలయ స్కౌట్ మాస్టర్ శశికిరణ్, గైడ్ కెప్టెన్ మీనా చంద్రన్ పాల్గొన్నారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఎగురవేస్తున్న దృశ్యం. ముడులను పరిశీలిస్తున్న విద్యార్థులు

## ఏపీలో స్వచ్ఛ విప్లవం


**అమరావతి, ఏప్రిల్ 8 :**
ఆంధ్రప్రదేశ్‌ను డంప్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రూ. 528.65 కోట్లతో 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బోర్డు ఆమోదం తెలిపింది. చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎండీ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎం. నాగలక్ష్మి, బుచ్చా రామారెడ్డి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ?ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ 5,385 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి, తడి చెత్త నుండి నాణ్యమైన బయో-ఫెర్టిలైజర్లను తయారు చేయనున్నారు. తద్వారా చెత్త ద్వారా సంపద సృష్టించి మున్సిపాలిటీలకు ఆదాయం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం. జూన్ మొదటి వారంలో 10 క్లస్టర్లలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థల నుండి చెత్తను సేకరించేందుకు ఏజెన్సీలను సిద్ధం చేశామన్నారు.




# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న బైకర్




టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీక్‌డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్‌మైషోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా రేసింగ్ సీక్వెన్స్‌లలో ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతోందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. కొత్త కాన్సెప్ట్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపిన 'బైకర్' ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటూ బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు ర్యూమర్స్



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక్ వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ ఈ ప్రాజెక్ట్‌పై రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్

# లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్




విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది. ప్రమోషన్స్ లో భాగంగా ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న విఘ్నేష్.. ధనుష్ గురించి మాట్లాడుతూ..'ధనుష్ సార్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన్ని ఎప్పుడూ గొప్పగానే చూస్తాను. జులై 28 ఆయన బర్త్ డే. అది మా మా నాన్న చనిపోయిన రోజు. దాని వల్ల ధనుష్ లో నేను నా తండ్రిని చూసుకున్నట్లు ఫీల్ అవుతాను. ఆయన మీద అంత ప్రేమ ఉంది' అని అన్నారు.

# విమర్శకులకు ఘాటు సమాధానం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్, అక్షయ్‌ఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.